1952 ఎన్నికలలో దేశంలోని తక్కిన ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు మెజారిటీ దక్కినా మద్రాసు రాష్ట్రంలో మాత్రం 375 సీట్లలో 152 మాత్రమే దక్కాయి. మెజారిటీకి 10 తక్కువ. ముఖ్యమంత్రి కుమారస్వామి రాజాతో సహా చాలామంది మంత్రులు ఓడిపోయారు. స్వతంత్రులు 63 మంది నెగ్గారు. కమ్యూనిస్టులకు 61 వచ్చాయి. రాజాజీని కేంద్ర రాజకీయాల నుండి రాష్ట్రరాజకీయాల్లోకి తీసుకుని వచ్చారు. గవర్నరు అతి పెద్ద పార్టీగా కాంగ్రెస్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయమంటూ ఆహ్వానించారు. రాజాజీ ముఖ్యమంత్రి అవుతూనే 9 మంది సభ్యులున్న కామన్‌వీల్ పార్టీని అనుబంధంగా చేర్చుకున్నాడు. డిఎంకె వారు ఆ పార్టీకి వ్యతిరేకంగా నిరసనలు తెలియపరచినా లాభం లేకపోయింది.

ఇంతలో 1952 ఆగస్టు 1 న పెరియార్ కొత్త ఆందోళన ప్రారంభించాడు. రైల్వే స్టేషన్లలోని బోర్డుల్లో హిందీ అక్షరాలను చెరిపివేసే కార్యక్రమం అది. డికె, డిఎంకె రెండూ విడివిడిగా ఆ ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొన్నాయి. 1952లోనే డిఎంకె కు ఊపు నిచ్చే సినిమా ఒకటి విడుదలైంది. కరుణానిధి రచించిన "పరాశక్తి" (1952) అనే ఆ సినిమా తమిళ సినిమారంగాన్నే మార్చి వేసింది. తమిళ రాజకీయాలు - 9 లో కరుణానిధి జీవితం గురించి చెపుతూ "రాజకుమారి" సినిమా నిర్మాణసమయంలో ఎమ్జీయార్‌తో అతనికి ఏర్పడిన స్నేహం గురించి చెప్పాను. ఆ తర్వాత సినిమారంగంలో దూసుకుపోయాడని యీ సినిమా గురించి ప్రస్తావించి వదిలివేశాను. ఇప్పుడు దాని గురించి కాస్త విపులంగా చెప్పుకోవచ్చు.

1947లో "రాజకుమారి"తో సినీరంగ ప్రవేశం చేసిన కరుణానిధికి తొలిదశలో నిరాశలు తప్పలేదు. "రాజకుమారి", "అభిమన్యు" సినిమాలకు అతని రచన చేసినా టైటిల్స్‌లో అతని పేరు వేయలేదు. అయినా అతని ప్రతిభను గుర్తించిన మోడరన్ థియేటర్స్ సుందరం నెలకు 500 రూ.ల జీతంపై తన తదుపరి సినిమాకు పెట్టుకున్నాడు. అక్కడే అతనికి కణ్ణదాసన్ పరిచయమయ్యాడు. "మంత్రికుమారి" (1950) హిట్ కావడంతో కరుణానిధికి "పరాశక్తి" ఛాన్సు వచ్చింది. "పరాశక్తి" మామూలు సెంటిమెంటల్, మెలోడ్రమటిక్ సినిమా. దానిలో రాజకీయాలు, డిఎంకె సిద్ధాంతాలు చొప్పించాడు కరుణానిధి. కళ్యాణి అనే ఒకమ్మాయికి ముగ్గురు అన్నలు. ఆమె చిన్నప్పుడే వాళ్లు రంగూన్‌కి వలస వెళ్లారు. రెండవ ప్రపంచయుద్ధం కారణంగా వాళ్లు వెనక్కి తిరిగి వచ్చే సమయంలో ముగ్గురూ విడిపోయారు. పెద్దవాడు జడ్జికాగా, రెండోవాడు (ఎస్ఎస్ రాజేంద్రన్) యుద్ధంలో పాదం పోగొట్టుకున్నాడు. మూడోవాడు (శివాజీ గణేశన్) మోసగించబడి డబ్బు పోయి బతకడానికి పిచ్చివాడిలా నటిస్తూ చెల్లెలి కోసం, తక్కిన అన్నలకోసం వెతుకుతున్నాడు.

కళ్యాణికి పెళ్లయి, భర్తను పోగొట్టుకుంటుంది. చిన్న పిల్లవాడితో వున్న ఆమెను గుడి పూజారి కామిస్తాడు, కష్టాల పాలు చేస్తాడు. ఈ బాధలు భరించలేక ఆమె పిల్లాణ్ని కాలువలో పడేసి (ఎవరో రక్షిస్తారులెండి), తనూ ఆత్మహత్యాప్రయత్నం చేస్తుంది. ఆమెపై కేసు పెడతారు. అదే సమయంలో మూడో అన్న పూజారిని కొట్టి కోర్టుకి రావలసి వస్తుంది. అతను పెద్ద ఉపన్యాసం దంచుతాడు. రంగూన్ శరణార్థులను యీ ప్రభుత్వం ఏమీ ఆదుకోవడం లేదని, నిరుద్యోగం, అవినీతి, దేవుడి పేర మోసాలు, కులవివక్షత - యివన్నీ తమిళనాడును పట్టి పీడిస్తున్నాయని! క్లియోపాత్రాకు ముత్యాలు సరఫరా చేసిన తమిళనాడు (ఇది నిజమా కాదా అని ప్రేక్షకులు అడగలేదు సరికదా విపరీతంగా చప్పట్లు కొట్టారు) యీనాడు యిలా వుండడానికి కారణం అసమర్థ ప్రభుత్వమేనని డైలాగులు అప్పచెప్పాడు. జడ్జిగా వున్న పెద్దన్నగారు ఉపన్యాసానికి మురిసి, వీళ్లను వదిలేసి, ఆపై గుర్తుపట్టి అక్కున చేర్చుకోవడంతో సినిమా ముగుస్తుంది.

సినిమా ద్వారా అణ్నాను, డిఎంకెను ప్రమోట్ చేశాడు కరుణానిధి. సినిమా మొదట్లోనే ద్రవిడనాడును కీర్తిస్తూ ఒక పాట వుంటుంది. పాట చివర్లో అణ్నా వాయిస్ వస్తుంది - 'సముద్రంలోని నీరు ఉప్పగా ఎందుకు వుందో తెలుసా? విదేశాలకు వెళ్లిన తమిళుల కన్నీళ్లే అవి' అంటూ. ద్రవిడ ఉద్యమనాయకుల ఫోటోలు అవీ సినిమాలో కారెక్టర్ల పూర్వీకుల ఫోటోలుగా చూపించారు. ఈనాడు సటిల్ (ఇన్‌సైడ్) మార్కెటింగ్‌గా చెప్పేది ఆనాడే వీళ్లు ప్రయోగించారు. కళ్యాణిని 'పుట్టబోయే బిడ్డకు పేరేం పెడతావు?' అని ఒకళ్లు అడిగితే 'అమ్మాయి అయితే నాగమ్మ (పెరియార్ మొదటి భార్య పేరు) అబ్బాయి అయితే పన్నీర్ సెల్వం (జస్టిస్ పార్టీ నాయకుడి పేరు)' అని సమాధానం చెపుతుందామె.

హీరో తన ప్రేయసిని అడుగుతాడు 'ఇంత తెలివిగా మాట్లాడుతున్నావే, ఎవరు నీ గురువు?' అని. 'అణ్నా' అంటుందామె. అంటూ సినిమాలో తన అన్నను చూపించినా అణ్నాదురైను ఉద్దేశించి అందని ఎవరైనా గ్రహించగలరు. హీరో అన్నగారు ముష్టివాళ్లపై అభిమానంగా వుంటాడు. హీరోయిన్ వాళ్లందరినీ తన బంగళాకు తీసుకుని వచ్చి వారికోసం ఆశ్రయం కట్టిస్తుంది. ఆ ఆశ్రయాన్ని అణ్నా ప్రారంభిస్తున్నట్లుగా చూపించారు. వేదికపై రాజాజీ, పెరియార్ వున్నట్టు, కరుణానిధి అణ్నాకు శాలువాను కప్పుతున్నట్లు చూపారు. నిజానికి యివన్నీ వేరే ఫంక్షన్‌లో తీసిన ఫోటోలు. ఈ సినిమాలో వాడుకున్నారు.

సినిమా సూపర్ హిట్ అయింది. సినిమాలోని డైలాగులు ప్రజలను పిచ్చెక్కించాయి. రాసినది కరుణానిధి, పలికినది శివాజీ గణేశన్. ఆ కాంబినేషన్ అరుదైన కాంబినేషన్. అప్పటిదాకా పెళ్లి పందిళ్లలో ఎమ్మెస్ సుబ్బులక్ష్మి, త్యాగరాజ భాగవతార్ వంటి వారి పాటలు వేస్తూండేవారు. "పరాశక్తి" విడుదల తర్వాత వాటి డైలాగుల రికార్డులు వేసేవారు. అదీ వాటి పాప్యులారిటీ. తర్వాతి కాలంలో ఎవరైనా సినిమా ఛాన్సు కోసం ప్రయత్నించేవారిని - రచయిత అయితే కరుణానిధి స్టయిల్లో రాయగలవా? అని, యాక్టరయితే శివాజీ గణేశన్‌లా డైలాగులు చెప్పగలవా? అని నిర్మాతలు అడిగేవారు. శివాజీ గణేషన్ తొలి సినిమాతోనే స్టార్ అయిపోయాడు. ఇప్పటికీ ఆ సినిమా డైలాగుల గురించి చెప్పుకుంటారు. డిఎంకె మీటింగుల్లో శివాజీ వచ్చి ఆ డైలాగులు

వల్లించి జనాలు పోగయ్యేట్టు చూసేవాడు. తన పాప్యులారిటీ చూసి తనకు డిఎంకెలో శత్రువులు తయారయ్యారని శివాజీ తర్వాతి కాలంలో వాపోయాడు. తనను ఉత్తిపుణ్యాన డిఎంకె నుండి తరిమివేసి, కాంగ్రెస్‌లో వున్న ఎమ్జీయార్‌ను డిఎంకెకు తెచ్చారని, అందుచేత తను కాంగ్రెస్‌లోకి వెళ్లవలసి వచ్చిందని చెప్పుకున్నాడు. (సశేషం) **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**